క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సైదులు

పటాన్‌చెరు : మండలం చిన్న కంజర్ల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను గురుకులాల సొసైటీ సెక్రటరీ సైదులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పాఠశాలలోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, పరిసరాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థితో మాట్లాడి భోజనానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ స్రవంతితో మాట్లాడి పలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఏటీపీ చంద్రకళ, డిప్యూటీ వార్డెన్ శ్రీధర్, అధ్యాపకులు ఉన్నారు.

ప్రైవేటు ఆగడాలను అరికట్టాలి

నారాయణఖేడ్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఆగడాలను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర్య విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఖేడ్ ప్రాంతంలో అనుమతులు లేకుండానే అనేక ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్వచ్ఛత అందరి బాధ్యత



మురుగును తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత ప్రతీ ఒక్కరి బాధ్యతని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న భారీ మురుగు కాల్వలో పేరుకుపోయిన బురదను జేసీబీ సహాయంతో తొలగించారు. స్వచ్ఛత, పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తూ గోడలకు వాల్ పెయింటింగ్ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు, విద్యార్థులు పరిశుభ్రతపై సులభంగా అవగాహన పెంచుకునేలా విద్యాసంస్థలకు వెళ్లే మార్గాల ప్రహరీలపై బొమ్మలు వేయిస్తున్నామన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సీఎం అత్తామామలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి పుణ్యక్షేత్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి అత్తామామలు పద్మారెడ్డి, పారిజాతం దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారిచే ప్రత్యేక పూజలు చేయించారు.

మెరుగైన వైద్య సేవలను అందించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధురెడ్డి వైద్యులను కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని బస్తీ దవాఖానను సందర్శించారు. అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం బొంబాయి కాలనీలో రైతు బజార్‌ను సందర్శించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

హత్నూర (సంగారెడ్డి): గుర్తుతెలియని కాలిన మృతదేహం హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఎరుకల సాయిలు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు ఎరుకల శ్రీను (25) చిన్నప్పటి నుంచి పటాన్ చెరువు మండలం బీరంగూడ పట్టణంలో నివసించేవాడు. 2002లో నర్సాపూర్‌లో దొంగతనం కేసులో పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేయగా దర్యాప్తు కోసం నర్సాపూర్‌కు వచ్చినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం కాసాల శివారులోని ఇప్పలకుంట సమీపంలో కాలిపోయిన మృతదేహం పోలీసులకు లభించింది. కుటుంబీకులు శవాన్ని పరిశీలించగా శ్రీనుగా గుర్తించారు. యువకుడిని హత్య చేసి ఆనవాళ్లు కనిపించకుండా కాల్చివేశారన్న అనుమానం వ్యక్తమవుతుంది.

డంపింగ్ యార్డ్‌కు తాళం

5రోజులుగా చెత్త సేకరణ బంద్



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిలిపిన చెత్త ఆటోలు



కొల్లూరు చెత్త డంపింగ్ యార్డ్‌కు తాళం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 5రోజులుగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు చెత్త డంపింగ్ యార్డ్‌కు తాళం వేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.. గురువారం చెత్త సేకరించి స్వచ్ఛ ఆటో కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త ఆటోలను తీసుకు వస్తే కాని అధికారుల్లో చలనం రాలేదు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో చెత్త డంపింగ్ యార్డ్‌కు గత ప్రభుత్వం భూమిని కేటాయించి అందులో తడి, పోడి చెత్తను వేరు చేసేందుకు కావాల్సిన ఏర్పాటులను చేసింది. మొదటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్‌లో వేసి తగలబెడుతున్నారు. దీంతో డంపింగ్ యార్డ్ సమీప గ్రామస్తులు దుర్వాసన, పోగ కారణంగా అనారోగ్య బారిన పడటంతో వారు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి వారి సమస్యను తెలియజేశారు. అయినప్పటికీ అధికారుల తీరులో మార్పురాకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. డంపింగ్ యార్డ్‌లో తడి, పోడి చెత్తను వేరు చేయకపోవడం, ఏళ్ల తరబడి చెత్త అలాగే ఉంచడంతో భూగర్భజాలలు సైతం కాలుష్యమవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానిపై ఆగ్రహించిన పలువురు డంపింగ్ యార్డ్‌కు తాళం చేసినట్లు స్వచ్ఛ ఆటో కార్మికులు చర్చించుకుంటున్నారు. గత ఐదు రోజుల క్రితం సేకరించిన చెత్త ఆటోలలోనే ఉంచడంతో దుర్వాసన కారణంగా స్థానికులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అందుకే మున్సిపల్ కార్యాలయం వద్దకు ఆటోలను తీసుకోచ్చినట్లు చెత్త ఆటో కార్మికులు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ మేనేజర్ అఖిల్‌ను వివరణ కోరగా.. సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

రక్తదానం.. ప్రాణదానం

ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్



జోగిపేటలో రక్తదానం చేస్తున్న యువకులు

జోగిపేట(అందోల్): రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేయడమేనని జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం జోగిపేటలోని ఎస్‌బీఐ పోస్ట్ ఆఫీస్ బ్రాంచి కార్యాలయం ఆవరణలో జూలై 1 బ్యాంకు స్థాపనను పురస్కరించుకొని రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు 80 మంది యువకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఆరు మాసాల కొకసారి రక్తదానం చేయవచ్చునని డాక్టర్లు చెబుతుంటారని తెలిపారు. బ్యాంకుల ద్వారా వ్యాపారులు, మహిళలు, యువకులు స్వయం ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య మాట్లాడుతూ.. బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారిని అభినందించారు. వారికి బ్యాంకు తరఫున సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు నాగరాజు, శమశేఖ్, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరీ, ఫీల్డ్ ఆఫీసర్ జయరాం, సిబ్బంది దుర్గారాజ్ పాల్గొన్నారు.

రసాయన రహిత సాగుకు ప్రోత్సాహం



అవగాహన కల్పిస్తున్న ఏఓ శంకర్

నారాయణఖేడ్: రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఖేడ్ మండల వ్యవసాయ అధికారి శంకర్ తెలిపారు. ఖేడ్ మండలం లింగాపూర్ శివారులో పలువురు రైతుల వ్యవసాయ భూముల్లో గురువారం మట్టి నమూనాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి సహజ వ్యవసాయ జాతీయ మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల ఆహారభద్రత, గ్రామీణాభివృద్ధి, స్థితిస్థాపకత పెంపొందించడమే లక్ష్యమన్నారు. సేకరించిన మట్టినమూనాలను పరీక్షించి ఫలితాలను త్వరలో అందజేస్తామన్నారు. ఏఈఓ సతీష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

ఎంపీఓ మహేందర్ రెడ్డి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఎర్దనూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా వాటిని పూడ్చి వేయించాలన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పాతటైర్లు, పూల కుండిల్లో నిలిచే నీటితో దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు పంచాయతీ సిబ్బంది చెప్పాలని సూచించారు. అనంతరం గ్రామంలోని డంపు యార్డు, వైకుంఠధామం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే, పంచాయతీ రికార్డులను తనఖీ చేసి పంచాయతీ కార్యదర్శి మాణిక్యంకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన బంతుల పంపిణీ

కంది(సంగారెడ్డి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జైలు అధికారులు శ్రీకారం చుట్టారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీడ్‌బాల్స్‌ను ఖైదీలతో తయారు చేయిస్తున్నారు. జైలు అధికారుల ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ పంపులకు వచ్చే వారందరికీ ఈ విత్తన బంతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కందిలోని కాశీపూర్‌లోని పెట్రోల్ పంపులో ఖైదీల ద్వారా వాహనదారులకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ కళాశాల మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో ఖైదీలతో 25 వేల విత్తన బంతులను తయారు చేయించినట్లు తెలిపారు. ఈ విత్తన బంతులను వ్యవసాయానికి అనువుగా లేని ప్రాంతంలో పారవేయడం వల్ల వివిధ రకాల మొక్కలు మొలిచి వృక్షాలుగా మారి పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. జైలు అధికారుల నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్డి పెద్ద చెరువు కబ్జాపై కన్నెర్ర



మార్డి పెద్దచెరువులో సర్వే చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు కబ్జా చేయడంతో రైతులు కన్నెర్ర చేశారు. గురువారం సర్వే చేసేందుకు ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ అధికారులు వెళ్లారు. చెరువు కబ్జా చేసిన వ్యక్తికి అనుకులంగా వ్యవహరిస్తున్నారని రైతులు తహసీల్దార్ శివశ్రీనివాస్‌పై మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించి బౌండరీలు ఏర్పాటు చేస్తామని చెప్పిన రైతులు వినిపించుకోలేదు. మరోపక్క చెరువు కబ్జాపై ఇరిగేషన్ ఏఈలు శివధర్‌రెడ్డి, మల్లేశం సర్వే చేపట్టారు. చెరువు చుట్టూ సర్వే చేపట్టి జెండాలు ఏర్పాటు చేసే పనులు మొదలు పెట్టారు. దీనికి సంబంధిత రైతు గోవర్ధన్ రెడ్డి అడ్డు చెప్పారు. సర్వే జరగకుండా అడ్డుకున్నారు. దీంతో గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తుల మధ్య వాగ్వాదం చొటు చేసుకుంది. చెరువు కబ్జా జరగడంతో పూర్తిస్థాయిలో సర్వే జరుగుతుందని ఏఈ శివధర్‌రెడ్డి తెలిపారు. సర్వే పూర్తి చేసేందుకు వారం రోజులు సమయం పడుతుందన్నారు. గ్రామస్తులు, రైతులు గోవర్ధన్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ గురుకులమే లక్ష్యం కావాలి

ఆర్సీఓ నాగార్జున రావు



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఆర్సీఓ నాగార్జున రావు

కంగ్టి(నారాయణఖేడ్): రాష్ట్రంలోని కంగ్టి ఎస్టీ గురుకుల పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలని ఆర్సీఓ నాగార్జున ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఎస్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తిని ఉత్తేజ పర్చి అన్నీ రంగాల్లో అభివృద్ధికి సంసిద్ధులను చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలోనే ఉత్తమ గురుకులంగా అభివృద్ధి చేయాలని కోరారు. విద్యార్థులకు చక్కని బోధనతో పాటు ఆటాపాటల్లోనూ శిక్షణనివ్వాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని అధికారులను ఆదేశించారు. పౌష్టికాహారంతో పాటు రుచి, సూచి పాటించాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మహేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందున్నామని భారతీయ జనతా మజ్దూర్ సంఘం జాతీయ చైర్మన్ బిశ్వప్రియ, జాతీయ అధ్యక్షుడు అర్నాబ్ ఛటర్జీ అన్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలు మహేందర్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మిక హక్కుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు కృషితోనే నిధులు జమ

నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితోనే ప్రభుత్వం దిగివచ్చి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసిందని నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు హరీశ్‌రావును కలిసి ఘనంగా సన్మానించారు. రైతు భరోసా నిధులు ఖాతాల్లో పడడంపై రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రిని కృతజ్ఞతలతో సన్మానించారు. అనంతరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీ రైతుల సంక్షేమం కోసమే నిలుస్తుందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు చొరవతోనే ప్రభుత్వం 22 వేల మంది రైతులకు భరోసా నిధులు వేసిందని ఇది ముమ్మాటికి బీఆర్ఎస్ పార్టీ విజయమన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుతో రైతులు

మీసేవ కేంద్రాల్లో తనిఖీలు



మీసేవ కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీలో నకిలీ మీసేవ సర్టిఫికెట్లు చలామణి అవుతున్నాయని బొల్లారం వాసులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మీసేవ కేంద్రాల అధికారి ఉదయ్, తహసీల్దార్ బృందం మీసేవ కేంద్రాలతో పాటు జిన్నారంలో రెండు, బొల్లారంలో మూడు ఆధార్ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్‌ల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. నకిలీ సర్టిఫికెట్లను తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులకు పారదర్శకమైన సేవలు అందించాలని తహసీల్దార్ దేవదాస్ సూచించారు. బొల్లారంలోని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు ఆధార్ కేంద్రాలను సీజ్ చేశారు. కాజిపల్లి లోని మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు అనుమతులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్ ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ ఆపరేటర్లు మౌలాలి మహేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత**

నారాయణఖేడ్: ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సుతో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను గురువారం ఖేడ్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ అందజేశారు. ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, కాంగ్రెస్ ముఖ్య నాయకులు సాయిలుపటేల్, మధు, శివకాంత్, మధు, సంగమేష్ పాల్గొన్నారు.

◆ **మాజీ మంత్రికి కృతజ్ఞతలు**

పటాన్‌చెరు టౌన్: మాజీ మంత్రి హరీశ్‌రావును బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం కలిసి పటాన్‌చెరు నియోజకవర్గం రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులు రాకపోవడంతో జిన్నారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి రైతుల ఖాతాలో రైతు భరోసా జమ చేసిందని తెలిపారు.

◆ **ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు**

పటాన్‌చెరు టౌన్: గ్రామాల సమగ్ర అభివృద్ధికి నూతన మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం, ఐనోలు, రామేశ్వరం బండ, గ్రామాల ప్రజలు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతన మున్సిపాలిటీల ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు పరిపాలన వికేంద్రీకరణ సాధ్యమవుతుందని తెలిపారు.

◆ **సామాజిక సేవలతోనే గుర్తింపు**

జిన్నారం (పటాన్‌చెరు): సామాజిక సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు లభిస్తుందని మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రం ప్రాథమిక పాఠశాలలో ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఉదయ్‌కుమార్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు స్వచ్ఛందంగా పంపిణీ చేశారు.

◆ **ఆలయ పునర్నిర్మాణానికి విరాళం**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు సంబంధించిన నెహ్రూ నగర్‌లోని హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందించాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు. జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ తనవంతుగా రూ.51 వేలు అందిస్తామని హామీనిచ్చారు. అందుకు సంబంధించిన చెక్కును ఫౌండేషన్ ప్రతినిధులు ఆలయకమిటీ బాధ్యులకు అందజేశారు.

◆ **వీధిదీపాలను ఏర్పాటు చేయండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో వీధిదీపాల సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ పుష్ప జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ వీధిదీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపకమిషనర్‌ను కలసి 700 విద్యుత్ వీధిదీపాలు.. మరో 700 వీధి దీపాలు మెయిటెనెన్స్‌కు కావాలని కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్



ర్యాలీలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సురేష్



జహీరాబాద్: ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

పటాన్‌చెరు టౌన్: మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యతని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం నుంచి మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసులకు సహకారం అందించాలన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ ర్యాలీలో పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి, ఎస్ఐలు సుభాష్, ఆసిఫ్ అలీ, శ్రీశైలం, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్‌మున్సిపల్ పరిధిలోని బీరంగూడ రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక పై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అమీన్‌పూర్ క్రైమ్ సీఐ సత్యనారాయణ అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు పదార్థాల వాడకంతో జీవితం చిత్తు

జోగిపేట(అందోల్): మాదక ద్రవ్యాల వినియోగంతో యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం జోగిపేటలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జోగిపేట ఎస్ఐ పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను వినియోగించొద్దు

నారాయణఖేడ్: మాదక ద్రవ్యాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఖేడ్‌లో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాలను వినియోగించబోమని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నివారణ

నారాయణఖేడ్: మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరం సమష్టిగా కృషి చేయాలని నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, న్యాయవాదులు నర్సారెడ్డి, లక్ష్మణ్‌రావు, నర్సింహారావు, సంగమేశ్వర్‌రెడ్డి, సుధాకర్, మోహిద్ పటేల్, సాయిలు, పవన్ పాటిల్, భువనేశ్వరి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి

జహీరాబాద్ టౌన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాగారెడ్డి స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ రహదారి గుండా లైఫ్‌స్టయిల్ కాంప్లెక్స్ వరకు కొనసాగింది .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, సిగరెట్, మద్యం, బీడీ, గుట్కా వంటివి తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఖలీల్, డీఎస్పీ, సైదానాయక్, సీఐ శివలింగం, రూరల్ సీఐ హన్మంత్, టౌన్ ఎస్ఐ, వినయ్‌కుమార్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు

కంగ్టి(నారాయణఖేడ్): యువతీ యువకులు మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగంతో వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం అంతా ప్రభావితమై పతనానికి దారి తీస్తుందని హెచ్చరించారు.